





అఖిలపక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



పునర్విభజనతో పెను ముప్పు

ఏ నిష్పత్తిలో జరిగినా నష్టమే

- త్వరలో ఉమ్మడి కార్యాచరణ కమిటీ
- అఖిలపక్ష సమావేశంలో స్టాలిన్

చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాది రాష్ట్రాలకు పెను ముప్పు కలగజేస్తుందని, రాజకీయ ప్రాతినిధ్య హక్కులు హరించుకుపోతాయని, ఈ అంశాలను దృష్టిలో ఉంచుకునే ముందస్తు చర్యల్లో భాగంగా ఉమ్మడి కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేయనున్నామని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. చెన్నై సచివాలయం ప్రాంగణంలోని 'నామక్కల్ కవింజర్ మాళిగై'లో బుధవారం జరిగిన అఖిలపక్ష సమావేశానికి నేతృత్వం వహించిన స్టాలిన్.. తీర్మానాలను ప్రవేశపెడుతూ పునర్విభజన వల్ల కలిగే నష్టాలను ఆయా పార్టీల ప్రతినిధులకు వివరించారు. కుటుంబ నియంత్రణ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి జనాభా నియంత్రణ చేసిన దృష్ట్యా రాష్ట్రంలోని లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య తగ్గించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందన్నారు. ప్రస్తుత జనాభా లెక్కల ఆధారంగా దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య తగ్గదని చెబుతూనే మరో వైపు ఉత్తరాది రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్య విపరీతంగా పెంచేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం ఇప్పటి వరకూ పారదర్శకత పాటించడం లేదన్నారు. రాజ్యాంగ నిపుణులు చెప్పిన మేరకు లోక్‌సభ స్థానాల పునర్విభజన రెండు విధాలుగా జరిగే అవకాశముందన్నారు. ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరిగితే రాష్ట్రంలో ఉన్న లోకసభ సభ్యుల సంఖ్య 39 నుండి 31కి తగ్గిపోతుందని, ఎనిమిది స్థానాలు కోల్పోవలసి వస్తుందన్నారు. అదేవిధంగా ప్రస్తుతమున్న ఎంపీల సంఖ్యను 543 నుండి 848కి పెంచినట్లయితే, ప్రస్తుతం అమలులో ఉన్న నిష్పత్తి ప్రకారమే పునర్విభజన జరిగితే రాష్ట్రానికి అదనంగా 22 లోక్‌సభ స్థానాలు కేటాయించాల్సి ఉన్నప్పటికీ, జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే 10 లోక్‌సభ స్థానాలే వస్తాయని స్టాలిన్ సోదాహరణంగా వివరించారు. ఈ రెండు పద్ధతులలో నియోజకవర్గాల పునర్విభజన జరిగినా పార్లమెంట్‌లో రాష్ట్ర ప్రాతినిత్యం తగ్గుతుందని, అదే సమయంలో అధిక జనాభా వున్న ఉత్తరాది రాషాల్లో ఎంపీల సంఖ్య విపరీతంగా పెరుగుతుందన్నారు. దీంతో ఆ రాష్ట్రాలకే ఉభయ సభల్లోనూ ప్రాతినిధ్యం అధికంగా ఉంటుందని, వారి మాటలే చెల్లుబాటు అవుతాయన్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కుట్రను ముందుగా పసిగట్టి రాష్ట్ర ప్రాతినిధ్య హక్కులకు నష్టం కలుగకుండా ఉండేందుకే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశానని, తాను ప్రతిపాదించిన తీర్మానాలకు అన్ని పార్టీలూ మద్దతివ్వడం హర్షదాయకమని స్టాలిన్ అన్నారు. భారత ఫెడరల్ రాజ్యాంగ విధానాన్ని దక్షిణాది రాష్ట్రాల హక్కులకు పెనుముప్పు కలగజేయనున్న నియోజకవర్గాల పునర్విభజనను సమష్టిగా వ్యతిరేకించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. ఆ దిశగా సమైక్య ఉద్యమం నిర్వహించేందుకు కూడా అన్ని పార్టీలూ సిద్ధం కావాలని కూడా ఆయన పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో డీఎంకే తరఫున పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి, రాజ్యసభ సభ్యుడు, న్యాయవాది విల్సన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు దురై మురుగన్, కేఎన్ నెహ్రూ, తంగం తెన్నరసు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, అన్నాడీఎంకే తరఫున మాజీ మంత్రి డి.జయకుమార్, ఇన్బదురై, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, సీఎల్పీ నేత రాజేష్‌కుమార్, ఎంఎన్ఎం నేత కమల్‌హాసన్, టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, డీపీఐ నేత తిరుమావళవన్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ముత్తరసన్, మాజీ ఎమ్మెల్యే పెరియసామి, సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి షణ్ముగం, ఎండీఎంకే నేతలు వైగో, దురై వైగో, పీఎంకే నేత డాక్టర్ అన్బుమణి, డీఎండీకే ప్రధాన కార్యదర్శి పార్థసారథి, ప్రిసీడియం చైర్మన్ ఇళంగోవన్, ద్రావిడ కళగం నేత కె.వీరమణి, తదితరులు పాల్గొన్నారు.

స్టాలిన్ ప్రతిపాదించిన తీర్మానాలు

- భారతదేశ ఫెడరల్ రాజ్యాంగ విధానానికి, రాష్ట్రంలోనూ, దక్షిణాది రాష్ట్రాల్లోనూ రాజకీయ ప్రాతినిధ్య హక్కులకు పెనుముప్పు కలిగేలా జనాభా లెక్కల ఆధారంగా పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనకు ముక్తకంఠంతో వ్యతిరేకత.
- దేశ ప్రయోజనాల దృష్ట్యా జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశామనే ఏకైక కారణంతో తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని తగ్గించడం అన్యాయం. ఈ విధంగా జనాభా నియంత్రణకు అన్ని రాష్ట్రాలను ప్రోత్సహించడానికి 1971లో జనాభా ప్రాతిపదికన పార్లమెంటరీ నియోజకవర్గాలను కొనసాగిస్తామని 2000లో అప్పటి ప్రధాని హామీ ఇచ్చినట్లుగానే ప్రస్తుత ప్రధాని మోదీ 2026 నుంచి మరో 30 యేళ్ల వరకు ప్రస్తుతం ఉన్నట్టే అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య కొనసాగిస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్.
- పార్లమెంట్‌లో ప్రస్తుతమున్న సభ్యుల సంఖ్య పెంచేయోచనఉంటే 1971నాటి జనాభా లెక్కల ప్రాతిపదికన ప్రస్తుతం పార్లమెంట్‌లో ఉభయ సభ ల్లో ఏ నిష్పత్తిలో నియోజకవర్గాలున్నాయో అదే నిష్పత్తిలో తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్య పెంచేదిశగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్.
- నియోజకవర్గాల పునర్విభజనను తమిళనాడు వ్యతిరేకించడం లేదని, అదే సమయంలో గత ఐదు దశాబ్దాలుగా సామాజిక, ఆర్థికపరమైన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న రాష్ట్రాలను దండించే విధంగా ఈ పునర్విజన ఉండకూడదని సూచన.
- ఈ డిమాండ్లను రాష్ట్రానికి సంబంధించిన కనీసపక్షమైన కోరికలుగా కేంద్ర ప్రభుత్వానికి అఖిలపక్ష సమావేశం ప్రతిపాదన.
- ఈ డిమాండ్ల ఆమోదం కోసం ఏ రకమైన ఆందోళనలు, ఉద్యమాలు నిర్వహించాలన్న విషయమై నిర్ణయం తీసుకునేందుకు, ఈ కీలకమైన సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించే ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసేందుకు రాష్ట్రంతోపాటు దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ఎంపీలతో ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం. ఆ దిశగా ఆ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలకు అధికారిక ఆహ్వానపత్రాలు పంపాలని నిర్ణయం.

• అఖిలపక్షం...

అందరిదీ ఒకే మాట..ఒకే బాట!

చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి స్టాలిన్ చేసిన తీర్మానాలకు బీజేపీ, టీఎంసీ సహా ఐదు పార్టీలు మినహా 56 పార్టీల ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతూ క్లుప్తంగా ప్రసంగించారు. ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే గట్టి మద్దతు ప్రకటించింది. ఆ వివరాలు వారి మాటల్లోనే...



డి.జయకుమార్ (అన్నాడీఎంకే): నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకిస్తూ పాలకపక్షం చేసిన తీర్మానానికి మా పార్టీ మద్దతు ఇస్తుంది. పార్లమెంట్‌లో ప్రస్తుతమున్నట్టే 7:2 నిష్పత్తిలోనే సభ్యుల సంఖ్య కొనసాగాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నాం.



అన్బుమణి (పీఎంకే): దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ పర్యటించి ఆయా రాష్ట్రాల సీఎంలను కలిసి ఉమ్మడి కార్యాచరణ రూపొందించుకోవడం అవసరం. ఈ తీర్మానానికి మా పార్టీ మద్దతిస్తుంది.



తిరుమావళవన్ (డీపీఐ): దక్షిణాది రాష్ట్రాల ఎంపీల ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన హర్షణీయం. నియోజకవర్గాల పునర్విభజనలో దళితులు, మైనారిటీల ఓట్లు చెల్లాచెదురయ్యేలా ఎలాంటి చర్యలు ఉండకూడదు.



ముత్తరసన్ (సీపీఐ): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం సస్పెన్స్ కొనసాగిస్తోంది. ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించడం లేదు. ఎంపీల సంఖ్య తగ్గితే సమైక్య ఉద్యమానికి వెనుకాడం.



కమల్‌హాసన్ (ఎంఎన్ఎం): నియోజకవర్గాల పునర్విభజన వల్ల రాష్ట్రానికే కాదు ఆంధ్రా, కర్ణాటక, కేరళ, పంజాబ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, హిమాచల్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలకు కూడా తీరని నష్టం కలగడం ఖాయం. అందుకే ఈ రాష్ట్రాలకు ఎలాంటి ముప్పు వాటిల్లకూడదనే ఈ అఖిలపక్ష సమావేశం కేంద్రానికి విజ్ఞప్తి చేస్తోంది. ఎంపీల సంఖ్య కుదింపును ముందుగానే పసిగట్టి భవిష్యత్ ముప్పుకు అడ్డకట్ట వేయడమే మంచిది. 'ఇండియా'ను 'హిందియా'గా మార్చేయాలనుకుంటున్నారు. కనుక సీఎం స్టాలిన్ ప్రతిపాదనకు గట్టి మద్దతునిస్తున్నాం.



వైగో (ఎండీఎంకే): నియోజకవర్గాల పునర్విభజన విషయంలో మనమంతా బీజేపీకి ప్రధానమైన వ్యతిరేక శక్తిగా మారాల్సిన అవసరం ఉంది. పునర్విభజనను వ్యతిరేకించే రాష్ట్రాలతో కలిసి కేంద్రంపై ఒత్తిడి చేసి పునర్విభజన జరుగకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.

జవాహిరుల్లా (ఎంఎంకే): నియోజవర్గాల నిష్పత్తిలోనే అయోమయం కొనసాగుతోంది. మన రాష్ట్రంలో ఎంపీల సంఖ్య తగ్గదని సంతృప్తిగా ఉండలేం. అదే సమయంలో ఉత్తరాది రాష్ట్రాల్లో ఎంపీలు సంఖ్య విపరీతంగా పెరిగితే మన ప్రాతినిధ్యానికి విలువే ఉండదు.

సెల్వపెరుందగై (టీఎన్‌సీసీ): నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే ఎలాంటి చర్యలనైనా కాంగ్రెస్ సమర్థిస్తుంది. అవసరమైతే ఉద్యమానికి కూడా సిద్ధమవుతుంది.

దిష్టిబొమ్మలుగా ఉంటే ప్రయోజనం ఏంటి?



- ఎంపీల సంఖ్యపై అన్ని రాజకీయ పార్టీలతో కలిసి పోరాటం
- టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రకటన

అడయార్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): దేశంలో తాజా జనాభా లెక్కల ప్రకారం ఎంపీల సంఖ్య పెంచి, వారిని అలంకార బొమ్మలుగా కూర్చొబెట్టడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటని తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ ప్రశ్నించారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన వల్ల రాష్ట్రానికి ఏదైనా అన్యాయం జరుగుతుందని తెలిస్తే అన్ని పార్టీలతో కలిసి టీవీకే పోరాటం చేస్తుందని ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని 84వ ఆర్టికల్ సవరణ మేరకు లోక్‌సభ సీట్ల పునర్విభజనను 2026 వరకు నిలుపుదల చేసారన్నారు. ఆ తర్వాత పునర్విభజనపై కేంద్రం దృష్టిసారించే అవకాశం ఉందన్నారు. అయితే, ఈ పునర్విభజన ఏ ప్రాతిపదికన చేస్తారన్న విషయంపై స్పష్టత లేదన్నారు. లోక్‌సభలో సీట్ల సంఖ్య పెంచాలన్నా, తగ్గించాలన్నా.. మరో మారు రాజ్యాంగ సవరణ జరగాల్సి ఉందన్నారు. ఈ పునర్విభజన ఏ విధంగా జరిగినా అందులో జనాభా సంఖ్య మాత్రం ప్రధాన ప్రాతిపదికంగా ఉంటుందనేది బహిరంగ రహస్యమన్నారు. దీనివల్ల దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ఆస్కారం ఉందన్నారు. గడిచిన 50 యేళ్ళుగా విద్య, వైద్యం, కుటుంబ నియంత్రణ వంటి అంశాలపై తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు రూ.కోట్లు వెచ్చించి, విజయం సాధించాయన్నారు. ఇప్పుడది దక్షిణాది రాష్ట్రాలకు అపార మైన నష్టాన్ని చేకూర్చుతుందన్నారు. ఇప్పటికే ఒక రాష్ట్రంలో 80 లోక్‌సభ సీట్లుంటే ఇతర రాష్ట్రాల కంటే ఆ రాష్ట్రం ఎంతో శక్తివంతంగా ఉంటుందన్నారు. పునర్విభజన వల్ల ఈ సీట్ల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. దక్షిణాది రాష్ట్రాలతో పోల్చితే యూపీ లేదా బీహార్ వంటి రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య పెరిగితే దీన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించజాలమన్నారు. కొత్తగా నిర్మించిన పార్లమెంట్ భవనాన్ని 888 మంది ఎంపీలు కూర్చొనేలా కేంద్ర తీర్చిదిద్దడం వెనుక దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా తెలుస్తుందన్నారు. ఒకవేళ దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి హాని కలగకుండా ఇతర రాష్ట్రాలకు మేలు చేకూర్చేలా పునర్విభజన చేసినప్పటికీ దాన్ని కూడా అంగీకరించలేమన్నారు. ఎంపీల సంఖ్య పెంచుకుని వారిని అలంకార బొమ్మలుగా కూర్చోబెట్టడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. లోక్‌సభ, శాసనసభ సభ్యుల సంఖ్య తక్కువ అనేది ప్రజాసమస్య కాదన్నారు. దానికంటే అనేక సమస్యలు సమాజంలో ఉన్నాయని, వీటి పరిష్కారం కోసం పాలకులు దృష్టిసారించాలని కోరారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించే సొమ్మును లక్షల కోట్ల రూపాయలను ఎంపీల జీతభత్యాలకు, ఇతర సౌకర్యాలకు ఖర్చు చేస్తున్నారని గుర్తు చేశారు. ఇలాంటి అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని 1971 జనాభా లెక్కల ప్రకారం చేపట్టిన ఎంపీల సీట్ల సంఖ్యలో ఎలాంటి మార్పులు లేకుండా యధాతథంగా ఉంచాలన్నారు. అలాకుండా తాజా జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ సీట్ల సంఖ్య పునర్విభజించి, ఒకటి రెండు రాష్ట్రాల్లో వచ్చిన సీట్ల సంఖ్యతో అధికారాన్ని చెలాయించాలని చూస్తే మాత్రం రాష్ట్రంలోని అన్ని పార్టీలతో కలిసి తాము పోరాటం చేస్తామని విజయ్ విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (గురువారం) : 6.25
సహర్ (శుక్రవారం) : 4.40

ప్లస్ వన్ పరీక్షలు ప్రారంభం



అంబులెన్స్‌లో పరీక్షా కేంద్రానికి వస్తున్న విద్యార్థిని జాస్మిన్

పెరంబూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 7,557 పాఠశాలలకు చెందిన 3,89,423 మంది విద్యార్థులు, 4,28,946 మంది విద్యార్థినులు, 4,755 మంది ప్రైవేటు అభ్యర్థులు, 137 మంది ఖైదీలు మొత్తం 8,23,261 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికోసం రాష్ట్రవ్యాప్తంగా 3,316 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయగా, 44,236 మందిని ఇన్విజిలేటర్లుగా విధులు నియమించారు. అవకతవకలు, మాస్ కాపీయింగ్ జరగకుండా 4,470 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ నిషేధించారు. నిబంధనలు అతిక్రమించే విద్యార్థులను మూడేళ్ల లేదా జీవిత కాలం పరీక్షలకు అనుమతించమని పరీక్ష శాఖ హెచ్చరికలు జారీచేసింది. అలాగే, పరీక్షల నిర్వహణపై విద్యార్థులు, తల్లిదండ్రులు సూచనలు, సలహాలు, ఫిర్యాదు చేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటైంది. ఈ కేంద్రం ప్రతిరోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేయనుంది. ఈ కేంద్రాన్ని 9498383075, 9498383076 అనే నెంబర్లను సంప్రదించవచ్చు. అలాగే, పాఠశాల విద్యాశాఖ 14417 అనే టోల్‌ఫ్రీ నెంబరును కూడా సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

ఆస్పత్రి నుంచి పరీక్షా కేంద్రాలకు...

ప్లస్ వన్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో, అనారోగ్యం, ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు హాజరయ్యారు. మదురై నెడుంకుళం గ్రామానికి చెందిన దినేష్ మదురై కళాశాల పాఠశాలలో ప్లస్ వన్ చదువుతున్నాడు. కొద్ది నెలల క్రితం వీరాదనూరు సమీపంలో బస్సు కోసం వేచి ఉండగా, ప్రభుత్వ బస్సు ఢీకొని కాళ్లు, వెన్నెముకకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రగాయాలతో ఉన్న దినేష్ బుధవారం ప్రారంభమైన పరీక్షల్లో సహాయకుడి ద్వారా పరీక్ష రాశాడు. అలాగే, నీలగిరి జిల్లా పట్టవయల్ గ్రామానికి చెందిన సైనుద్దీన్ ఇద్దరు కుమార్తెలు 'ఆస్టియోపోరోసిస్' వ్యాధితో బాధపడుతూ నడవలేక మంచం పట్టారు.. వారిలో రెండవ కుమార్తె జాస్మిన్ (17) బిదర్కాడు ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ప్లస్ వన్ చదువుతోంది. బుధవారం ప్రారంభమైన పరీక్షలకు జాస్మిన్‌ను అంబులెన్స్‌లో పాఠశాలకు తీసుకొచ్చి, అక్కడి నుంచి స్ట్రెక్చర్ ద్వారా పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లారు. ఆమె సహాయకుడి ద్వారా పరీక్ష రాసింది.



సహాయకురాలితో పరీక్ష రాస్తున్న విద్యార్థి దినేష్

లారీని ఢీకొన్న కారు

మాజీ కౌన్సిలర్ సహా ముగ్గురి మృతి

చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి సమీపం జాతీయ రహదారిలో బుధవారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో హోసూరు అన్నాడీఎంకే మాజీ కౌన్సిలర్ సహా ముగ్గురు మృతిచెందారు. ఈ ముగ్గురూ కారులో పర్యాటక ప్రాంతం హొగెనేకల్ వెళ్ళి స్వస్థలానికి తిరిగివస్తూ మృత్యువాత పడ్డారు. కృష్ణగిరి జిల్లా హోసూరు అలసనత్తం ప్రాంతానికి చెందిన అన్నాడీఎంకే మాజీ కౌన్సిలర్ మునికృష్ణన్ (50), తన స్నేహితులు శీనివాస్ (47), బసవరాజ్ (38), మంజునాథ్ (47), చంద్రప్రభ (50)తో కలిసి కారులో హొగెనేకల్‌కు విహారయాత్రగా వెళ్ళి తిరిగి స్వస్థలానికి బయలుదేరారు. బుధవారం ఉదయం ధర్మపురి సమీపం మహేంద్రమంగళం సమీపం జిట్టాండహళ్ళి కొత్త జాతీయ రహదారిలో ఆ కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఆ రోడ్డు పక్కనే నిలిచి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నడిపిన మునికృష్ణన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ సమాచారం తెలుసుకుని మహేంద్రమంగళం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారు శిథిలాల మధ్య తీవ్రగాయాలతో ఉన్న నలుగురిని అంబులెన్స్‌లో పాలకోడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. ఆ ఆసుపత్రిలో చేరిన కాసేపటికి బసవరాజ్, శీనివాస్ మృతిచెందారు. మంజునాథ్, చంద్రప్రభ ఆస్పత్రిలో చికిత్స పొందుకుంటున్నారు.



ప్రమాదంలో ధ్వంసమైన కారు వద్ద గుమికూడిన జనం

భారతీయార్ వర్సిటీలో చిరుత సంచారం

భయంతో ఇళ్లకు చేరిన విద్యార్థులు ● సెలవు ప్రకటించిన యాజమాన్యం

చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులోని భారతీయార్ విశ్వవిద్యాలయంలో బుధవారం వేకువజామున చిరుతపులి సంచరించడంతో విద్యార్థులు, అధ్యాపకులు, హాస్టల్ వార్డెన్‌లు భయభ్రాంతులకు గురయ్యారు. విద్యార్థులు ప్రాణభయంతో ఇళ్లకు పరుగెత్తారు. దీంతో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు బుధవారం సెలవు ప్రకటించారు. గురువారం ఆ విశ్వవిద్యాలయం క్రీడామైదానంలో జరగాల్సిన క్రీడాపోటీలను వాయిదా వేశారు.ఆ విశ్వవిద్యాలయం సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న భవనాల వద్ద బుధవారం వేకువజాము ఓ చిరుతపులి కార్మికుల కంటబడింది. దీనితో విశ్వవిద్యాలయం అధికా




భారతీయార్ వర్సిటీ మైదానంలో పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు - విశ్వవిద్యాలయం బస్సులో ఇళ్లకు వెళ్తున్న విద్యార్థినులు

రులు అటవీశాఖకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు అటవీశాఖ అధికారులు సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని పరిశీలించారు. చిరుతపులి తిరుగుతుందన్న ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. చిరుతపులిని అటవీశాఖ అధికారులు బంధించేంత వరకూ విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బంది విశ్వవిద్యాలయ మైదాన ప్రాంతాల్లోకి వెళ్లొద్దంటూ హెచ్చరించారు. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం చిరుతపులి సంచరిస్తున్న సమాచారం తెలియగానే ఆ విశ్వవిద్యాలయం మైదానంలో క్రీడా పోటీలకు శిక్షణ పొందుతున్న సుమారు 200 మంది విద్యార్థినులను హుటాహుటిన యూనివర్సిటీ బస్సులో వారిళ్లకు తరలించారు. ప్రస్తుతం అటవీ శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది తనిఖీలు చేస్తూ, ఆ చిరుతపులిని బంధించే ప్రయత్నాలు చేస్తున్నారు.

21న రామేశ్వరం జాలర్ల రైల్ రోకో

టి.నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం దాడులు, జాలర్ల అక్రమ నిర్బంధాలకు నిరసనగా రామేశ్వరం సమీపం తంగచ్చిమఠం వద్ద గత ఐదు రోజులుగా జాలర్లు నిర్వహిస్తున్న ఆందోళన తాత్కాలికంగా ఉపసంహరించుకున్నారు. అదే సమయంలో ఈ నెల 21న తమ డిమాండ్ల సాధన కోసం రైలు రోకో నిర్వహించనున్నట్లు జాలర్ల సంఘం నాయకులు ప్రకటించారు. గత జనవరి నుండి శ్రీలంక నావికాదళం చేసిన దాడుల్లో 131 మంది జాలర్లు అరెస్టయ్యారు. 18 మరపడవలను స్వాధీనం చేసుకున్నారు. 38 మంది జాలర్లకు జైలు శిక్ష విధించారు. రాష్ట్రానికి చెందిన 42 మంది జాలర్లు, పుదుచ్చేరికి చెందిన 13 మంది జాలర్లు జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. మరో 20 మంది జాలర్లకు ఆరునెలల నుండి రెండేళ్ల వరకూ జైలు శిక్ష విధించడంతో వారంతా ప్రస్తుతం జైళ్లలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లోనే శ్రీలంక జైలులో ఉన్న తమిళ జాలర్లను విడిపించాలని, స్వాధీనం చేసుకున్న మరపడవలను అప్పగించాలని కోరుతూ రామేశ్వరం జాలర్లు ఫిబ్రవరి 24 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. గత ఐదు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మంగళవారం సాయంత్రం రాష్ట్ర మత్స్యశాఖమంత్రి అనితా రాధాకృష్ణన్, శాసనసభ్యులు ఖాదర్‌బాషా, ముత్తురామలింగం తదితరులు తంగచ్చిమఠం వద్ద ఆందోళన జరుపుతున్న జాలర్ల సంఘాల నాయకులు, జాలర్లతో చర్చలు జరిపారు. శ్రీలంక నావికదళం దాడులకు గురయ్యే జాలర్ల కుటుంబాలకు ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థికసాయాన్ని పెంచినందుకు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు జాలర్ల సంఘం నాయకులు ధన్యవాదాలు తెలిపారు. నిరాహార దీక్షను తాత్కాలికంగా వాయిదావేయాలని మంత్రి కోరికను ఆందోళనకారులు అంగీకరించారు. అదే సమంలో అన్ని పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 21న రైలు రోకో జరుపనున్నట్లు ప్రకటించారు.

అసెంబ్లీ ఎన్నికలకు తొలి అభ్యర్థిని ప్రకటించిన సీమాన్

చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ తరఫున పోటీ చేయనున్న తొలి అభ్యర్థిని నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే) నాయకుడు సీమాన్ ప్రకటించారు. తెన్‌కాశి అసెంబ్లీ నియోజకవర్గం పార్టీ వైద్యవిభాగం సభ్యుడైన డాక్టర్ కౌశిక్ పాండ్యన్ పోటీచేస్తారని మంగళవారం రాత్రి తూత్తుకుడి జిల్లా సురండై వద్ద జరిగిన పార్టీ ప్రముఖుడి వివాహవేడుకల్లో ప్రకటించి కలకలం సృష్టించారు. డాక్టర్ కౌశిక్ పాండ్యన్ 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో విరుదునగర్ నియోజకవర్గంలో పోటీ చేసి ఓటమిపాలయ్యారు.



కౌశిక్‌పాండ్యన్

పాదయాత్ర భక్తులకు సపర్యలు


పెరంబూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ మురుగన్ ఆలయానికి పాదయాత్రగా వెళ్లే భక్తులకు తిరుచెందూర్ ధర్మశాల సంస్థ సభ్యులు సపర్యలు చేస్తున్నారు. తిరుచెందూర్ మురుగన్ ఆలయానికి భక్తులు పాదయాత్రగా వెళ్లి స్వామి దర్శనం చేసుకుంటుంటారు. తిరునల్వేలి జిల్లా వేప్పిలాన్‌కుళం ప్రాంతంలో తిరుచెందూర్ ధర్మశాల సంస్థ సభ్యులు 35 ఏళ్లుగా పాదయాత్ర భక్తులకు సపర్యలు చేస్తున్నారు. భక్తులకు తాగునీరు, ఆహారం, కాళ్ల నొప్పులతో బాధపడేవారికి మర్దనం తదితరాలు చేస్తున్నారు. భక్తులకు సేవలు చేయడం తమకెంతో సంతృప్తిని కలిగిస్తోందని సంస్థ సభ్యులు తెలిపారు.



భక్తుడి కాళ్లకు మర్దన చేస్తున్న సభ్యులు

కోళ్లఫారాల్లో పెరుగుతున్న గుడ్ల నిల్వలు

పెరంబూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ కోళ్ల ఫారాలో 2 కోట్ల గుడ్లు నిల్వ ఉండడంతో యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నామక్కల్ మండల పరిధిలో నామక్కల్, ఈరోడ్, తిరుప్పూర్, పల్లడం తదితర ప్రాంతాల్లో 6 కోట్లకు పైగా కోళ్లను పెంచుతున్నారు. ఆ కోళ్లు ప్రతిరోజు 5 కోట్ల గుడ్లు పెడుతుంటాయి. ఈ గుడ్లను రాష్ట్ర ప్రభుత్వ పౌష్టికాహార పథకంలో వినియోగిస్తుండగా, పొరుగు రాష్ట్రాలు, విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ విస్తరణ, ఎండల కారణంగా ప్రజలు కోడిగుడ్ల వినియోగం తగ్గించారు. దీంతో, కోళ్ల ఫాంలలో గుడ్ల నిల్వలు పెరుగుతున్నాయి. డిమాండ్ తగ్గడంతో ఐదు రోజుల్లో గుడ్డుపై సుమారు 1.10 పైసలు తగ్గించి ప్రస్తుతం ఫాం ధర 3.80 పైసలుగా ఉంది. ప్రస్తుతం ఫాంలలో 2 కోట్ల గుడ్లు నిల్వ ఉన్నాయని, మరో రెండు రోజుల్లో ఇవి పాడయ్యే అవకాశముందని, అలాగే, నిల్వలు కూడా పెరిగే అవకాశముందని ఫాం యజమానులు వాపోతున్నారు.



కళ్లకురుచ్చిలో రేషన్ బియ్యం స్వాధీనం

● నలుగురి అరెస్ట్

ప్యారీస్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చిలో అక్రమంగా నిల్వ వుంచిన 70టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆహార భద్రతా అధికారులు తెలిపారు. కళ్లకుర్చి ప్రాంతంలో రేషన్ దుకాణాల్లో కుటుంబ కార్డుదారులకు ఉచితంగా ఇస్తున్న రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసే కొంతమంది బ్లాక్ మార్కెట్లో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు జిల్లా ఆహార భద్రతా విభాగం అధికారులకు అందిన సమాచారంతో వారు బుధవారం ఉదయం ఓ గోదాము వద్ద నిఘా వేశారు. ఆ సమయంలో మూడు వాహనాల్లో బస్తాలు ఎక్కిస్తుండటం గమనించి, ఆ వాహనాలను చుట్టుముట్టారు. అనంతరం 70టన్నుల రేషన్ బియ్యాన్ని వాహనాల సహా స్వాధీనం చేసుకుని అక్రమ రవాణాకు పాల్పడిన నలుగురిని అరెస్టు చేశారు.

ఆలయ కచేరీల్లో సినిమా పాటలకు అనుమతి లేదు

● మద్రాసు హైకోర్టు

పెరంబూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో జరిగే సంగీత కచేరీల్లో సినిమా పాటలకు అనుమతి లేదని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఆలయ వేడుకల్లో నిర్వహించే పాట కచేరీల్లో అధికంగా సినిమా పాటలు పాడుతున్నారని, వాటిని నిషేధించి భక్తి గీతాలు మాత్రమే ఆలపించేలా ఉత్తర్వులు జారీచేయాలని వెంకటేష్ సౌరిరాజన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ బుధవారం విచారణకు రాగా హిందూ దేవాదాయ శాఖ తరఫున, ఆలయ కచేరీల్లో భక్తి పాటలు మాత్రమే ఆలపించేందుకు అనుమతులున్నాయని తెలియజేసింది. ఇరుతరపు వాదనల అనంతరం, ఆలయాల వేడుకల్లో నిర్వహించే కచ్చేరీల్లో సినిమా పాటలు చోటుచేసుకోరాదని, భక్తి గీతాలు మాత్రమే ఆలపించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

వేప చెట్టు నుండి పాలు



వేపచెట్టు నుండి కారుతున్న పాలు

చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా ఏరల్ సమీపంలోని పొలాల మధ్యన ఉన్న వేపచెట్టు నుండి చిక్కటి పాలు కారుతుండడంతో స్థానికులు వింతగా చూశారు. ఈ విషయం తెలిసిన చుట్టుపక్కల గ్రామస్థులు వచ్చి ఆ వేపచెట్టు నుండి కారుతున్న పాల లాంటి ద్రవాన్ని చూడటానికి బారులు తీరారు. అమ్మవారికి ప్రీతికరమైన వృక్షం వేపచెట్టు కనుక ఆ అమ్మవారే తన మహిమను చూపడానికి పాలను స్రవింపజేస్తున్నారని భావించిన మహిళలు ఆ చెట్టుకు చందనం, పసుపు, కుంకమ అద్ది, పట్టువస్త్రాన్ని కూడా కట్టారు. ప్రస్తుతం ఆ వేపచెట్టు ఆ ఊరి ప్రజలకు ఓ వింతగా మారింది.

వ్యవసాయ బడ్జెట్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

పెరంబూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బడ్జెట్‌పై ప్రజలు అభిప్రాయాలు తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు సచివాలయం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... రైతుల ఆదాయాన్ని పెంచి వారి జీవితాలు మెరుగుపరిచేలా ముఖ్యమంత్రి ఆదేశాలతో 2021-22వ ఆర్థిక సంవత్సరం నుండి వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు. రాబోయే 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వ్యవసాయ ప్రత్యేక బడ్జెట్‌ను ఈ నెల 15న శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బడ్జెట్‌లో చేర్చాల్సిన అంశాలపై ప్రజలు సూచనలు, సలహాలు అందించవచ్చు. ఆ ప్రకారం, ప్రజలు tnagribudget2025@gmail.com అనే ఈ-మెయిల్ ద్వారా తమ అభిప్రాయాలు తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది.

పిల్లలను పాఠశాలలో చేర్పించండి



అవగాహన ర్యాలీలో ఉపాధ్యాయులు

తిరుత్తణి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పిల్లలను పాఠశాలలకు పంపాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సూచించారు. తిరువళ్లూర్ జిల్లా ఈడిగపేటలోని పంచాయతి యూనియన్ పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శ్రీదేవి, హేమావతి మాట్లాడుతూ... ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని, విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం, పాదరక్షలు సహా మధ్యాహ్న భోజనం కూడా అమలులో ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, బడి మానేసిన పిల్లలను చేర్పించాలని కోరారు.

సెంగోట్టయ్యన్ సమక్షంలో ఎగిరిన కుర్చీలు

● గోపిచెట్టిపాళెయంలో అన్నాడీఎంకే నేతల రచ్చ

అడయార్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్ సమక్షంలో అన్నాడీఎంకే నేతలు రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు చేయి చేసుకుని, కుర్చీలను విసురుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈరోడ్ జిల్లా గోపిచెట్టిపాళెయంలోని ఓ కల్యాణ మండపంలో బుధవారం ఈ ఘటన జరిగింది. ఇటీవల అత్తికడవు - అవినాశి ప్రాజెక్టు రైతులు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రికి ఎడప్పాడి కె.పళనిస్వామికి సన్మానం చేశారు. దీనికి ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్ గైర్హాజరయ్యారు. ఆ తర్వాత ఆయన సారథ్యంలో జరిగిన సమావేశాల్లో ఎడప్పాడి ఫొటోలు కనిపించలేదు. అలాగే, నగరంలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కీలక సమావేశానికి కూడా సెంగోట్టయ్యన్ హాజరుకాలేదు. ఈపీఎస్, సెంగోట్టయ్యన్‌కు మధ్య నెలకొన్న విభేదాలే ఇందుకు కారణమని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. దీంతో సెంగోట్టయ్యన్‌ను పార్టీ నుంచి బహిష్కరించవచ్చనే వార్తలు కూడా వినిపించాయి. ఈ నేపథ్యంలో ఈరోడ్ గ్రామీణ జిల్లా నిర్వాహకుల సమావేశం బుధవారం స్థానికంగా ఉన్న ఓ కల్యాణ మండపంలో జరిగింది. ఇందులో సెంగోట్టయ్యన్‌తో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మేట్టుపాళెయం ఎమ్మెల్యే ఏకే సెల్వరాజ్ హాజరయ్యారు. ఇందులో సెంగోట్టయ్యన్ ప్రసంగం తర్వాత అందియూర్ ప్రాంతానికి చెందిన నేత ప్రవీణ్ లేచి... 2011 నుంచి పార్టీలో కీలక నేతగా ఉన్నప్పటికీ పార్టీ తరఫున తనకు ఎలాంటి ఆహ్వానాలు రావడం లేదని చెప్పడంతో మాజీ మంత్రి అతన్ని వేదికపైకి పిలిచి సముదాయించారు. ఈలోగా మరికొందరు నేతలు ప్రవీణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. నేతలు రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. కుర్చీలు విసురుకున్నారు. ఆ తర్వాత కల్యాణ మండపం నుంచి బయటకు వచ్చిన ప్రవీణ్‌పై కొందరు నేతలు దాడి చేశారు. మరికొందరు నేతలు ప్రవీణ్‌ను రక్షించారు. ఆ తర్వాత సమావేశంలో సెంగోట్టయ్యన్ మాట్లాడుతూ, సమస్యకు కారణమైన వ్యక్తి పార్టీ సభ్యుడు కాదన్నారు. ఈ సమస్యకు అందియూర్‌కు చెందిన ఈఎంఆర్ రాజా అనే వ్యక్తి కారణమని, పార్టీ ద్రోహులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ సెల్వరాజ్ ప్రకటించారు.



సమాచార దృష్టి

'పానుగంటివారి విశ్వరూపం -సాక్షి'పై 23న రెంటాల ప్రసంగం

టి.నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 159వ ప్రసంగ కార్యక్రమంగా 'పానుగంటివారి విశ్వరూపం - సాక్షి' అనే అంశంపై రాజమండ్రికి చెందిన విశ్రాంతాచార్యులు డా. రెంటాల శ్రీవెంకటేశ్వరరావు ప్రసంగించనున్నారని సంస్థ అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు టి.నగర్ ఆంధ్రా క్లబ్‌లోని కృష్ణాహాలులో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సాహితీ ప్రియులందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

కొత్తగా ఎల్ఎల్‌డీ పరిశోధన కోర్సు

పెరంబూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారిగా తమిళనాడు డా.అంబేడ్కర్ న్యాయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీతో పాటు అత్యున్నతమైన పరిశోధన కోర్సు ఎల్ఎల్‌డీ పరిచయం చేశారు. పీహెచ్‌డీ డిగ్రీ పొంది ఐదేళ్లు దాటిన వారు ఈ కోర్సులో చేరవచ్చు. ఈ కోర్సుల ఫుల్ టైం, పార్ట్ టైం కోర్సులుగా అందించనున్నారు. మరిన్ని వివరాలకు వర్శిటీ వెబ్‌సైట్ www.tndalu.ac.in సంప్రదించవచ్చు.

వీరాణం నుంచి నీటి సరఫరా పునరుద్ధరణ

టి.నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వీరాణం చెరువు నుండి నగరానికి నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు మెట్రోవాటర్ బోర్డు అధికారులు ప్రకటించారు. గత గురువారం సాయంత్రం వండలూరు కేళంబాక్కం రహదారిలో పుదుపాక్కం వద్ద వీరాణం చెరువు నుండి నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ లీకేజీ ఏర్పడటంతో నీటిసరఫరా నిలిపివేశారు. ప్రస్తుతం ఆ పైప్‌లైన్ మరమ్మతులు ముగియడంతో నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు.

జ్యూస్ దుకాణాల్లో తనిఖీలు

పెరంబూర్, మార్చి 5: జ్యూస్ దుకాణాల్లో తనిఖీలు చేయాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వేసవి సీజన్ ప్రారంభం కావడంతో ప్రజలు ఉపశమనం కోసం జ్యూస్, పుచ్చకాయలు, చెరకు రసం, శీతల పానీయాలు తాగుతుంటారు. ఇదే అదనుగా వ్యాపారులు నాణ్యత లేని జ్యూస్, పండ్లు అందిస్తున్నారని ఆరోగ్య శాఖకు ఫిర్యాదులందాయి. దీనిపై స్పందించిన ఆరోగ్యశాఖ కార్యదర్శి, జ్యూస్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలని ఉత్తర్వులు జారీచేశారు.

చలివేంద్రాలు ఏర్పాటుచేయండి: డీఎంకే

పెరంబూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండల నుంచి ప్రజలను రక్షించేలా చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని డీఎంకే పిలుపునిచ్చింది. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... ఈ ఏడాది వేసవి ఎండలు సాధారణం కన్నా అధికంగా నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. ఎండల నుంచి ప్రజలను రక్షించేలా నగరాలు, మున్సిపాలిటీల్లో ప్రధాన ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటుచేసి తాగునీరు, మజ్జిగ, పుచ్చకాయలు, టెంకాయ నీరు తదితరాలు అందించాలని డీఎంకే పిలుపునిచ్చింది.

వడదెబ్బ మృతులకు రూ.4 లక్షలు

పెరంబూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బ కారణంగా మృతిచెందే కార్మికుల కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు కార్మిక సంక్షేమ శాఖ మంత్రి గణేశన్ తెలిపారు. నగరంలో బుధవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... కార్మికుల సంక్షేమార్థం ప్రభుత్వం పలు పథకాలు అందజేస్తుందన్నారు. వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో, కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎండలు అధికంగా ఉన్న సమయంలో నిర్మాణ పనుల కార్మికులు సాధ్యమైనంత వరకు ఇంటి లోపలి పనుల్లో పాల్గొనాలని సూచించారు. వడదెబ్బ కారణంగా మృతిచెందే కార్మికుల కుటుంబాలకు రూ.4 లక్షలు పరిహారం అందించనున్నట్లు మంత్రి తెలిపారు.

రాయపేట ప్రభుత్వాస్పత్రిలో 'హీట్ స్ట్రోక్' ప్రత్యేక వార్డు

పెరంబూర్, మార్చి 5: వడదెబ్బకు గురైన వారికి చికిత్స అందించేలా అన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటుచేయాలని ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో రాయపేట ప్రభుత్వాసుపత్రిలో 10 పడకలతో 'హీట్ స్ట్రోక్' పేరుతో ప్రత్యేక వార్డు ఏర్పాటుచేశారు. ఈ వార్డులో ఓఆర్ఎస్, ఆక్సిజన్ వసతి, మందులు పూర్తిస్థాయిలో నిల్వ ఉంచినట్లు అధికారులు తెలిపారు.

24న ద్విచక్ర వాహనాల వేలం

పెరంబూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తాంబరం పోలీస్ కమిషనర్ కార్యాలయ పరిధిలోని పళ్లికరనై పోలీస్ స్టేషన్‌లో ఉన్న 145 ద్విచక్రవాహనాలను పళ్లికరనై పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో బహిరంగ వేలం వేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు గుర్తింపు కార్డు, జీఎస్టీ నెంబరుతో ఈ నెల 20వ తేది ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు డిపాజిట్ చెల్లించి పేరు నమోదుచేసుకోవాలి. 24వ తేది ఉదయం 10 గంటలకు నిర్వహించే వేలంలో పేర్లు నమోదుచేసుకున్న వారిని మాత్రమే అనుమతించనున్నట్లు తాంబరం పోలీసు కమిషనర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

'ఉమెన్స్ డే' సందర్భంగా ప్రత్యేక టూర్ ప్యాకేజీ

పెరంబూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర పర్యాటకాభివృద్ధి ప్రత్యేక విహార యాత్ర ఏర్పాటుచేసింది. ఆ ప్రకారం వాలాజా రోడ్డులోని పర్యాటక అభివృద్ధి శాఖ కార్యాలయం నుంచి ఉదయం 8 గంటలకు బయల్దేరే లగ్జరీ బస్సులో మహాబలిపురం తీసుకెళ్తారు. మధ్యాహ్న భోజనం అనంతరం ముదలియార్‌కుప్పం వెళ్లి పడవ సవారీ, సాహస క్రీడలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించనున్నారు. అనంతరం రాత్రి 8 గంటలకు మళ్లీ నగరానికి తీసుకురానున్నారు. ఈ పర్యటనకు ఒకరికి రూ.3,150 ఛార్జీగా నిర్ణయించారు. ఇందులో భోజనం, టీ ఇతర ఖర్చులు కలిపి ఉంటాయి. ఈ పర్యటనకు ముందుగా పేర్లు నమోదుచేసుకోవాల్సి ఉంది. ఆసక్తి కలిగిన వారు www.ttdconline.com అనే వెబ్‌సైట్, 7550063121 అనే వాట్సాప్ నెంబరు సంప్రదించవచ్చు.

మంత్రి పొన్ముడికి సీబీఐ కోర్టు సమన్లు

వాషర్‌మెన్‌పేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చట్టవిరుద్ధ నగదు బట్వాడా కేసులో మంత్రి పొన్ముడి ఈ నెల 19న స్వయంగా హాజరుకావాలని చెన్నై సీబీఐ కోర్టు సమన్లు జారీచేసింది. 2006-11 సంవత్సరాల్లో డీఎంకే ప్రభుత్వ హయాంలో విల్లుపురంలో ఎర్రమట్టి తవ్వకాలకు సంబంధించి మంత్రిపై నమోదైన కేసును సీబీఐ, ఈడీ శాఖలు విచారిస్తున్నాయి. ఈ కేసు బుధవారం సీబీఐ ప్రత్యేక కోర్టు విచారించగా, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ తరఫున అదనపు చార్జీషీటు దాఖలుచేశారు. విల్లుపురంలో అక్రమంగా చేపట్టిన ఎర్రమట్టి తవ్వకాలతో ప్రభుత్వానికి రూ.28.36 కోట్లు నష్టం ఏర్పడిందని అవినీతి నిరోధక శాఖ తెలిపింది. అనంతరం ఈ కేసు విచారణకు మంత్రి పొన్ముడి ఈ నెల 19వ తేది స్వయంగా హాజరుకావాలని సీబీఐ ప్రత్యేక కోర్టు సమన్లు జారీచేసింది.

● క్యారీ బ్యాగ్‌కు చార్జి ..

రూ.15వేల పరిహారం ఇవ్వాలని ఉత్తర్వులు

పెరంబూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉచితం అని ప్రకటించి క్యారీ బ్యాగ్‌కు నగదు వసూలుచేసిన రెడీమేడ్ షోరూమ్ యజమాని వినియోగదారుడికి రూ.15,000 పరిహారం ఇవ్వాలని చెన్నై జిల్లా వినియోగదారుల కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. పెరంబూర్‌లోని ఓ రెడీమేడ్ షోరూమ్‌లో అయనావరానికి చెందిన శ్రీధర్ 2023లో రూ.8,373 విలువైన దుస్తులు కొనుగోలు చేశాడు. దుస్తులు తీసుకెళ్లేందుకు 2 క్యారీ బ్యాగ్‌లు ఇచ్చి వాటికి రూ.16 వసూలుచేశారు. ఈ విషయమై శ్రీధర్ జిల్లా వినియోగదారుల కోర్టులో ఫిర్యాదు చేశాడు. ఈ పిటిషన్ విచారించిన కోర్టు, ఉచితమని చెప్పి నగదు వసూలుచేయడం వినియోగదారులను మోసం చేయడమేనని, బాధితుడి రూ.15వేలు పరిహారం చెల్లించాలని, రెండు నెలల్లో పరిహారం ఇవ్వని పక్షంలో, పరిహారం చెల్లించే వరకు ఏడాదికి 9 శాతం వడ్డీ చెల్లించాలని ఉత్తర్వులు జారీచేసింది.

కదిర్‌మేడు, కట్టప్ప రోడ్డు శ్మశానవాటికల మూసివేత

పెరంబూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని రెండు శ్మశాన వాటికలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మాధవరం మండలం వార్డు 31 భారతీయార్ వీధిలోని కదిర్‌వేడు, 32వ వార్డు భారత్ నగర్‌లోని కట్టప్ప రోడ్డు తదితర రెండు శ్మశానవాటికల్లో కొత్తగా గ్యాస్ దహనవాటికలు ఏర్పాటుచేస్తున్న కారణంగా ఈ నెల 6 నుంచి నవంబరు 5వ తేది వరకు మూసివేయనున్నారు. ఈ రోజుల్లో ప్రజలు మాధవరం మండలం 24వ వార్డులోని పుళల్ దహనవాటిక, 30 వార్డు పరిధిలోని వినాయకపురం దహనవాటికలు వినియోగించుకోవాలని జీసీసీ ఒక ప్రకటనలో తెలియజేసింది.

బెలూన్ మింగి ఏడు నెలల బాలుడి మృతి

పెరంబూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బెలూన్ మింగిన ఏడు నెలల చిన్నారి మృతిచెందిన ఘటన తంజావూరు జిల్లాలో చోటుచేసుకుంది. ఒరత్తనాడు సమీపం ఊరణిపురం గ్రామానికి చెందిన సతీష్‌కుమార్-శివగామి దంపతుల ఏడు నెలల కుమారుడు సోమవారం హఠాత్తుగా శ్వాస తీసుకోలేక ఇబ్బందులు పడ్డాడు. తల్లిదండ్రులు వెంటనే బాలుడిని పట్టుకోట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఆ బాలుడిది అనుమానాస్పద మృతి అంటూ మంగళవారం తంజావూరు ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తీసుకెళ్లి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదికలో, చిన్నారి కడుపులో బెలూన్ ఉండడం వలనే ఊపిరాడక మృతిచెందిందని నిర్ధారించారు. ఈ ఘటనపై తిరువోనం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మాదక ద్రవ్యాల స్వాధీనం

● ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్ పరిధిలో మాదకద్రవ్యాలు తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎగ్మూర్ పోలీసులు సోమవారం రాత్రి ఎగ్మూర్ రైల్వేస్టేషన్ కౌంటర్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించారు. వారు అస్సాం రాష్ట్రానికి చెందిన హబిబూర్ రెహ్మాన్, దిల్దార్ హుస్సేన్, రేకిబుల్ ఇస్లామ్ అని తెలిసింది. వారి నుంచి 3 గ్రాముల హెరాయిన్, 8 గ్రాముల మార్ఫిన్ తదితర మాదకద్రవ్యాలు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని, మంగళవారం కోర్టులో హాజరుపరచి, రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించినట్లు నగర పోలీసు శాఖ బుధవారం ప్రకటన విడుదల చేసింది.

వంటగ్యాస్ లీకై వ్యాపించిన మంటలు

● నలుగురికి తీవ్రగాయాలు

చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వేళచ్చేరి సమీపం కోవిలంబాక్కం గాంధీనగర్ 15వ వీధిలోని ఓ ఇంటిలో బుధవారం వేకువజాము గ్యాస్‌లీకై అగ్ని ప్రమాదం సంభవించడంతో నిద్రపోతున్న ఒకే కుటుంబానికి చెందిన మునుసామి, ఆయన భార్య రాణి, కుమార్తె శాంతి, మనవడు అజిత్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని చుట్టుపక్కల నివసిస్తున్నవారు చికిత్స నిమిత్తం కీల్పాక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ అగ్ని ప్రమాదంలో ఇంటిలోని వస్తువులన్నీ కాలిపోయాయి. మేడవాక్కం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

వీధికుక్క దాడిలో బాలికకు గాయాలు

తిరుత్తణి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వీధికుక్క దాడిలో బాలికకు తీవ్రగాయాలయ్యాయి. తిరువళ్లూర్ జిల్లా తిరువాలంగాడు యూనియన్ చిన్నమ్మపేట పూంజోలై నగర్‌కు చెందిన ప్రీతిక (9) ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్క దాడిచేసింది. బాలిక కేకలు విని చుట్టుపక్కల వారు వెళ్లి శునకాన్ని తరిమివేసి, బాలికను తిరువళ్లూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ బాలిక తలకు గాయాలు కావడంతో, 8 కుట్లు వేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై తిరువాలంగాడు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



గాయపడిన ప్రీతిక

నోలంబూరులో కారు, ఆటోల అద్దాల ధ్వంసం


ప్యారీస్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక నోలంబూరులో రోడ్డుపక్కన నిలిపివున్న కారు, ఆటోల అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, పరారయ్యారు. వారిని అరెస్టు చేయాలని స్థానికులు బుధవారం ధర్నా నిర్వహించారు. నోలంబూరు ప్రాంతంలో మంగళవారం రాత్రి రోడ్డుపక్కన నిలిపివుంచిన కారు, ఆటోల రెండు అద్దాలను ధ్వంసం చేసిన వ్యక్తులను అరెస్టు చేయాలని కోరుతూ నిర్వహించిన ధర్నాలో సుమారు వంద మందికి పైగా స్థానికులు పాల్గొన్నారు. సమాచారం తెలిసి అక్కడికి చేరుకున్న పోలీసులు ఆందోళనకారులను సర్దిచెప్పి పంపారు. అనంతరం కేసు నమోదు చేసిన పోలీసులు సంఘటనా స్థలంలోవున్న సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి ఆ కోణంలో దర్యాప్తు ప్రారంభించారు.

టీవీ సీరియళ్లకు సెన్సార్‌బోర్డు కోరుతూ పిటిషన్

● కేంద్ర టెలికామ్ సంస్థకు హైకోర్టు నోటీసు

టి.నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): టీవీ ఛానెళ్లలో వివాహేతర సంబంధాలు, కుట్రలు, కుతంత్రాలు వంటి కథాంశాలతో ప్రసారమవుతున్న సీరియల్స్ ప్రకటనలను క్రమబద్ధీకరించేందుకు బుల్లితెరకు కూడా ప్రత్యేకంగా సెన్సార్‌బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు ధర్మాసనం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర టెలికాం రెగ్యులేటరీ కమిషన్‌కు నోటీసు పంపింది. మదురైకి చెందిన కేకే రమేష్ దాఖలు చేసిన ఈ ప్రజాహిత వ్యాజ్యంలో ప్రస్తుతం టీవీ ఛానెళ్లలో ప్రసారమవుతున్న సీరియల్స్ సినిమాలను మించిపోయి ద్వంద్వార్థాలు, అశ్లీలత, వివాహేతర సంబంధాలు, అసభ్యకర సన్నివేశాలుంటున్నాయని, ఇలాంటి సీరియల్స్ యువతపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ఈ పరిస్థితుల్లో సినిమాలకు ఉన్నట్లుగానే టీవీ సీరియల్స్, వాటి మధ్యలో ప్రసారమయ్యే జుగుప్సాకరమైన ప్రకటనలు కట్టడి చేయడానికి ప్రత్యేకంగా సెన్సార్‌బోర్డు ఏర్పాటు చేసేలా ఆదేశాలివ్వాలని పిటిషనర్ కోరారు. సెన్సార్‌బోర్డు సర్టిఫికెట్ పొందిన తర్వాతే ఈ సీరియల్స్ ప్రసారమయ్యేలా చర్యలు తీసుకోవాలని, సెన్సార్‌షిప్ లేకుండా సీరియల్స్ ప్రసారం చేసేవారికి భారీ జరిమానా విధించేలా ఉత్తర్వులివ్వాలని కోరారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన న్యాయమూర్తులు నిషా భాను, శ్రీమతితో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్‌ను సమర్పించాలని కేంద్ర టెలీకమ్యూనికేషన్ రెగ్యులేటరీ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసి కేసు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

తమిళ చిత్రజ్యోతి



గాయపడిన కార్తి

● ఆగిన 'సర్దార్-2' షూటింగ్

'సర్దార్-2' చిత్ర షూటింగులో హీరో కార్తి కాలికి గాయమైంది. ఈ సినిమా షూటింగులో భాగంగా చెన్నైలో భారీ యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఆ తర్వాత మైసూరులో కొన్ని సన్నివేశాల షూటింగ్ కోసం వెళ్ళారు. అక్కడే ఈ నెల 7వ తేదీ వరకు షూటింగ్ షెడ్యూల్ ప్లాన్ చేశారు. ఆ సమయంలో చిన్న ప్రమాదం జరగడంతో హీరో కాలికి గాయమైంది. దీంతో షూటింగ్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు. గాయపడిన వెంటనే కార్తిని సమీపంలోని ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. చిన్నగాయమేనని, వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని వైద్యులు సూచించారు. దీంతో చిత్రం బృందం మైసూర్ షెడ్యూల్ రద్దు చేసుకుని చెన్నై తిరిగి వచ్చింది. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై మిత్రన్ జవహర్ దర్శకత్వంలో ఈ మూవీ తెరకెక్కుతుంది. ఇందులో కార్తితో పాటు ఎస్‌జే సూర్య, సూరజ్, ఆషికా రంగనాథ్, మాళవికా మోహనన్, రజిషా విజయన్ తదితరులు నటిస్తున్నారు.

ఆ పేరే హృదయానికి హత్తుకుంటుంది



● నయనతార

అగ్రహీరోయిన్ నయనతార అభిమానులకు ఒక విజ్ఞప్తి చేసింది. తనను లేడీ సూపర్‌స్టార్ అని పిలవద్దని కోరారు. అభిమానులు ఎంతో ప్రేమతో అలా పిలవడం ఆనందంగా ఉన్నప్పటికీ నయనతార అనే పేరే హృదయానికి హత్తుకుంటుందన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 'నా జీవితం తెరిచిన పుస్తకం. మీ అంతులేని ప్రేమ, మద్దతు దానికి మరింత ఆనందాన్ని జోడించాయి. ఎన్నో మరుపురాని విజయాలను అందించారు. నా సుఖ సంతోషాల్లో అండగా ఉన్నారు. అయితే, నయనతార అనే ఆ పేరు నటిగానే కాకుండా వ్యక్తిగా కూడా నేనేంటో తెలియజేస్తుంది. అభిమానులు ప్రేమతో ఇచ్చిన లేడీ సూపర్ స్టార్ బిరుదుకు నేను రుణపడివుంటాను. కానీ, నయనతార అని పిలిస్తేనే నాకు ఎంతో ఆనందంగా ఉంటుంది. అందువల్ల నన్ను లేడీ సూపర్‌స్టార్ అనికాకుండా నయనతార అని మాత్రమే పిలవండి' అని ఆమె సామాజిక మాధ్యమ వేదికగా విడుదల చేశారు.

ఇళయరాజా పాటలు వినడానికేనా..

పాడకూడదా? : పేరరసు

'ఇసైజ్ఞాని' ఇళయరాజా స్వరపరచిన పాటలు కేవలం వినడానికి మాత్రమేనా? వివిధ వేదికలపై పాడకూడదా? అని ప్రముఖ దర్శకుడు, కోలీవుడ్ సినీ దర్శకుల సంఘం ప్రధాన కార్యదర్శి పేరరసు ప్రశ్నించారు. మలయాళ చిత్రపరిశ్రమకు చెందిన నటీనటులు, టెక్నీషియన్లంతా కలిసి 'లీచ్' అనే మూవీని తమిళం, మలయాళ, తెలుగు భాషల్లో తెరకెక్కించారు. బుక్ ఆఫ్ సినిమా ప్రొడక్షన్ పతాకంపె అనూప్ రత్నా నిర్మించారు. ఎస్‌ఎం. దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ రిలీజ్ మంగళవారం నగరంలో జరుగగా ముఖ్య అతిథులుగా పేరరసు, సీనియర్ సినీ నిర్మాత కె.రాజన్‌తో పాటు చిత్ర బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేరరసు మాట్లాడుతూ, 'ఇళయరాజా పాటలు వింటూ మానసిక ఆనందం పొందవచ్చు. అలాంటి పాటలను వేదికలపై పాడకూడదని అంటున్నారు. ఇది ఎంతవరకు న్యాయం? కేవలం వినేందుకే పాటల స్వరాలు సమకూర్చుతున్నారా? ఇళయరాజా పాట పాడేందుకు పనికిరావా? అని ప్రశ్నించారు. సినిమాకు భాష ఇపుడు సమస్య కాదని కంటెంట్ బాగుంటే ఈ భాషలో తీసినా, ఏ నేటివిటికీ దగ్గరగా తీసినా ఆ చిత్రం ఘన విజయం సాధిస్తుందన్నారు. నిర్మాత కె.రాజన్ మాట్లాడుతూ, 'శివాజీ గణేశన్ ఇంటిని జప్తు చేయాలంటూ మద్రాస్ హైకోర్టు నోటీసు పంపింది. సినిమా తీసేందుకు రూ.3 కోట్ల రుణాన్ని శివాజీ మనవడు తీసుకుంటే ఇపుడది రూ.9 కోట్లకు చేరింది. రుణం తిరిగి చెల్లించనందుకు ఇంటిని జప్తు చేయాలని కోర్టు నోటీసు పంపింది. ఇది శివాజీ ఇంటికి పంపిన నోటీసు కాదు.. తమిళ చిత్రపరిశ్రమకు పంపిన నోటీసులా భావించి, ఆ ఇంటిని కాపాడండి. పది మంది పెద్ద నటులు ముందుకు వస్తే ఆ ఇంటిని రక్షించవచ్చు. తమిళ చిత్ర పరిశ్రమలో బడా నిర్మాణ కంపెనీలు హీరోల పారితోషికాన్ని అమాంతం పెంచేసి, చిన్న నిర్మాతలు సినిమాలు తీయకూడని పరిస్థితి కల్పించారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్ర నిర్మాత, నటుడు అనూప్ రత్న మాట్లాడుతూ, 'లీచ్' అంటే జలగ. అది మనకు తెలియకుండానే మన శరీరంలోని రక్తాన్ని పీల్చివేస్తుంది. చూడకపోతే ప్రాణమే పోతుంది. మన వెంట ఉండేవారిలో మంచివారు ఎవరు, చెడ్డవారు ఎవరన్నది తెలియదు. కానీ, మన రక్తాన్నీ పీల్చివేస్తారు. మీడియా సపోర్టు చేయాలి' అని కోరారు.



'లీచ్' ఆడియో రిలీజ్ దృశ్యం

కొత్త అవతారమెత్తిన విమల్

విభిన్నమైన పాత్రలు, కథాంశాలను ఎంచుకుంటూ తన సినీ కెరీర్ కొనసాగిస్తున్న హీరో విమల్ ఇపుడు సరికొత్త అవతారమెత్తారు. 'ఓం కాళి జై కాళి' పేరుతో ఓ వెబ్ సిరీస్‌ను తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ, బెంగాలీ, మరాఠీ భాషల్లో రూపొందించారు. ఇందులో ఆయన కాళిమాత వేషంలో కనిపించనున్నారు. ఈ వెబ్ సిరీస్ టీజర్ తాజాగా రిలీజ్ చేయగా, ఇందులో న్యాయానికి, అన్యాయానికి మధ్య జరిగే ఈ పోరాట కథలో విమల్ కాళీ పాత్ర అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. విమల్, సీమా బిస్వాస్, ఆర్‌ఎస్ శివాజీ, జీఎం కుమార్, కుమారవేల్, గంజా కరుప్పు, ప్రేమ, పావని, శివన్, క్వీన్స్ వంటివారు నటించిన ఈ చిత్రం జియోహాట్‌స్టార్‌లో ప్రసారంకానుంది. తమిళనాడు రాష్ట్రంలోని కులశేఖర్‌పట్టణంలో జరిగిన దసరా ఉత్సవాల్లో ఈ సినిమాల్లో చిత్రీకరించడం, ఈ స్క్రిప్టుపై నమ్మకాన్ని మరింతగా పెంచిందని దర్శకుడు అంటున్నారు.

'ఓం కాళి జై కాళి' ఓ దృశ్యం



ఐశ్వర్య హాస్పిటల్‌లో విజయవంతంగా వంద ప్రసవాలు



అడయార్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక తరమణిలోని ఐశ్వర్య హాస్పిటల్‌లో వంద ప్రసవాలను విజయవంతంగా పూర్తి చేసింది. మొత్తం 400కుపైగా పడకలున్న ఈ ఆస్పత్రిని గత జనవరిలో ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ ఆస్పత్రిలో వంద మంది గర్భిణులకు విజయవంతంగా కాన్పులు జరిపినట్టు ఆస్పత్రి యాజమాన్యం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇదే విషయంపై ఐశ్వర్య హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ ముత్తువేల్ మాట్లాడుతూ, 'ఐశ్వర్య హాస్పిటల్‌లో విజయవంతంగా వంద కాన్పులను పూర్తి చేయడం, తల్లులు, వారి పిల్లలు ఆరోగ్యంగా ఉండటం చాలా సంతోషంగా ఉందన్నారు. కేవలం ఒక నెల వ్యవధిలోనే ఈ మైలురాయి చేరుకోవడం ఆస్పత్రి వైద్యులు, నర్సులు, సహాయక సిబ్బంది అంకితభావానికి నిదర్శనమన్నారు.

రేపటి నుంచి రష్యన్ కల్చరల్ ఫెస్టివల్



అడయార్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 7వ తేదీ సాయంత్రం నుంచి రష్యన్ కల్చర్ ఫెస్టివల్ ప్రారంభం కానుంది. తేనాంపేట, కస్తూరి రంగన్ రోడ్డులో ఉన్న రష్యన్ హౌస్ (రష్యన్ కల్చరల్ సెంటర్)లో ఈ వేడుకలు జరుగనున్నాయి. ఇందులో క్లాసిక్ రష్యన్ నృత్యాలు, శాస్త్రీయ గాత్ర ప్రదర్శనలు రష్యన్ వస్త్రాభరణాలు ధరించి ప్రదర్శిస్తారని నిర్వాహకులు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో జరిగే ఈ అంతర్జాతీయ ఉత్సవాల్లో ప్రఖ్యాత కళాకారుడు ఎన్‌పీ ఒగరేవ్ ప్రదర్శన ఇస్తారని,ఈ కార్యక్రమానికి రష్యన్ సంస్కృతి, రమణీయ అందాలు, వైవిధ్యాన్ని వివరిస్తారని నగరంలోని కాన్సుల్ జనరల్ ఆఫ్ రష్యన్ ఫెడరేషన్ వాలెరీ ఖోడ్జాయేవ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

చర్చిల్లో భస్మ బుధవారం





నుదిటిపై శిలువ గుర్తు వేయించుకుంటున్న క్రైస్తవులు - ప్రసంగిస్తున్న ఫాదర్

● ఉపవాస దీక్షలు ప్రారంభం

ప్యారీస్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం సహా రాష్ట్రవ్యాప్తంగా చర్చిల్లో బుధవారం క్రైస్తవులు ఉపవాస దీక్షలు ప్రారంభించారు. ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన క్రైస్తవుల నుదిటిపై క్రైస్తవ మత పెద్దలు భస్మంతో శిలువ గుర్తు వేశారు. గుడ్ ఫ్రైడే నుంచి ఆదివారాలు మినహాయించి, వెనక వచ్చే బుధవారాన్ని క్రైస్తవులు భస్మ బుధవారంగా పాటిస్తారు. ఈ సందర్భంగా అన్ని చర్చిల్లో సాయంత్రం నిర్వహించే ప్రార్థనలకు క్రైస్తవులు పాల్గొంటారు. 40రోజుల ప్రత్యేక ప్రార్థనలకు క్యాథలిక్, ఈసీఐ, సీఎస్ఐ, బాప్టిస్ట్, కల్వరి, మారనాథ, లూథరన్, అపోస్తులు తదితర చర్చిలు ప్రత్యేక ప్రార్థనా కారక్రమాలకు సిద్ధమయ్యాయి. నాగపట్నం జిల్లా వేలాంకన్నిలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మేరీమాత పుణ్యక్షేత్రం, మైలాపూర్‌లోని శాంథోమ్ చర్చి, సెయింట్ థామస్ మౌంట్ చర్చి, సైదాపేట లిటిల్ మౌంట్ చర్చి, బీసెంట్ నగర్ అన్నై వేలాంకన్ని చర్చి, అంబత్తూరులోని క్యాథలిక్ చర్చి, తిరువళ్లూరులోని సెయింట్ పీటర్స్ చర్చి, తిరుముల్లైవాయిల్‌లోని తెలుగు బాప్టిస్ట్ చర్చి, ప్యారీస్ సెయింట్ ఆంథోని తదితర చర్చిల్లో నిర్వహించిన భస్మ బుధవారం ప్రత్యేక ప్రార్థనలకు క్రైస్తవులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. చెంగల్పట్టు జిల్లా కోవలంలోవున్న రెడ్‌కార్పెట్ ప్రాంగణంలో మద్రాస్ సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి కాపరి రెవ.డా.ఎస్.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పలు కమిటీల నిర్వాహకులు, సభ్యులు పాల్గొని ప్రత్యేక గీతాలు ఆలపించారు. సంఘ కార్యదర్శి పోతల ప్రభుదాస్ ఏప్రిల్ 13న మట్టల ఆదివారం, 18న గుడ్‌ఫ్రైడే, 20వ తేదీ ఈస్టర్ సందర్భంగా జరుపుకోనున్న ఆరాధనల గురించి వివరించారు.



శాంథోమ్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనకు హాజరైన క్రైస్తవులు



వెపేరి తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో ప్రార్థన చేస్తున్న సంఘ కాపరి రెవ.డా.రాజేంద్రప్రసాద్, నిర్వాహకులు

తుదిదశలో కిలాంబాక్కం రైల్వేస్టేషన్ పనులు



కిలాంబాక్కంలో ప్లాట్‌ఫారం, స్తంభాలు ఏర్పాటుచేస్తున్న దృశ్యం

పెరంబూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కిలాంబాక్కం రైల్వేస్టేషన్ నిర్మాణపనులు తుదిదశకు చేరుకున్నాయి. మే నెలలో పనులు పూర్తిచేసి జూన్, జూలై నెలల్లో ఈ రైల్వేస్టేషన్ ప్రజల అందుబాటులోకి రానుంది. నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా కిలంబాక్కంలో బస్ టెర్మినల్ ఏర్పాటుచేసి, దక్షిణాది జిల్లాలకు బస్సులు నడుపుతున్నారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి కిలంబాక్కం బస్ టెర్మినల్‌కు ఎంటీసీ బస్సులు నడుపుతోంది. కానీ, సబర్బన్ రైలు సౌకర్యం కల్పించాలని ప్రయాణికుల విజ్ఞప్తితో, వండలూరు-ఊరపాక్కం మధ్య రూ.20 కోట్ల వ్యయంతో కిలంబాక్కం రైల్వేస్టేషన్ నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ప్రస్తుతం ఈ స్టేషన్‌లో మూడు ప్లాట్‌ఫారాలు, స్తంభాల ఏర్పాటు పూర్తయింది. స్తంభాలపై పైకప్పు, సిగ్నలింగ్ వ్యవస్థ, స్టేషన్ మేనేజర్ కార్యాలయం, బుకింగ్ కౌంటర్లు తదితరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులు మే నెలలోపు పూర్తిచేసి జూన్, జూలై నెల నుంచి ప్రజల అందుబాటులోకి తీసుకురావాలని దక్షిణ రైల్వే నిర్ణయించింది. కాగా, కిలంబాక్కం రైల్వేస్టేషన్ నుంచి కిలంబాక్కం బస్ టెర్మినల్ వరకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.

ఇస్పానీ సెంటర్ ఆధ్వర్యంలో పాకశాస్త్ర పోటీలు



విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీఆర్టీ గ్రాండ్ ప్రాంగణంలో ఇస్పానీ సెంటర్ ఆధ్వర్యంలో పాక శాస్త్ర ప్రవీణుల కోసం క్విజ్‌బైట్స్ 3.0 పేరుతో వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు దక్షిణాది రాష్ట్రాలకు చెందిన సుమారు వంద మంది చెఫ్‌లు హాజరయ్యారు. దక్షిణభారత పాకశాస్త్ర ప్రవీణుల సంఘం అధ్యక్షుడు చెఫ్ దామోదరన్, ప్రధాన కార్యదర్శి చెఫ్ సీతారామ్ ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇస్పానీ సెంటర్ డైరెక్టర్ కేశన్ క్విజ్‌పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రజా గ్రీవెన్స్‌లో 25 వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ అరుణ్

పెరంబూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ జరిగింది. నగర పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అరుణ్, ప్రజలు, పోలీసుల సమస్యలు తెలుసుకొనేందుకు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. ఈ గ్రీవెన్స్‌లో కమిషనర్ స్వయంగా వినతిపత్రాలు స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, బుధవారం జరిగిన గ్రీవెన్స్‌లో కమిషనర్ అరుణ్ పాల్గొని ప్రజల నుంచి 25 వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సమస్యలు విచారించి పరిష్కారం చూపాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను కమిషనర్ ఆదేశించారు.



చెన్నై నగరంలో 1 నుండి 15 జోన్లలో పారిశుధ్య కార్యక్రమాల కోసం కొనుగోలు చేసిన టిప్పర్లు, మినీ లారీలు, ఎక్సకవేటర్లను జెండా ఊపి ప్రారంభిస్తున్న మేయర్ ఆర్.ప్రియ

చెన్నై వాల్‌టాక్స్ రోడ్డు అమ్మన్‌కోవిల్ వీధిలో నిర్మించనున్న కొత్త పాఠశాల భవనానికి భూమి పూజచేస్తున్న సీఎండీఏ ఇన్‌చార్జి మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్. ప్రియ తదితరులు



ఘనంగా బంగారు అడిగలార్ జయంతి

● రూ.4కోట్ల సంక్షేమ సహాయాల పంపిణీ



పేదలకు సంక్షేమ సహాయాలు పంపిణీ చేస్తున్న లక్ష్మీ బంగారు అడిగలార్, మలేసియా రాయబారి శరవణకుమార్ తదితరులు

ప్యారీస్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మేల్ మరువత్తూరులో ప్రసిద్ధిచెందిన ఆదిపరాశక్తి సిద్ధర్ పీఠాధిపతి బంగారు అడిగలార్ 85వ జయంతిని పురస్కరించుకుని రూ.4కోట్ల విలువైన సంక్షేమ సహాయాలను 15వేల మంది పేదలకు పంపిణీ చేశారు. ఈ పీఠంలో ఈనెల 1వ తేదీ కలశస్థాపన, హోమం వివిధ పూజలతో దివంగత బంగారు అడిగలార్ జయంతి వేడుకలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. రెండోరోజైన ఆదివారం బంగారు అడిగలార్ విగ్రహాన్ని స్వర్ణరథంలో ఊరేగించారు. అడిగలార్ జయంతి రోజైన సోమవారం ఉదయం 9.30గంటలకు ఆదిపరాశక్తి అమ్మవారికి అభిషేక అలంకార పూజలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించిన రథంలో అడిగలార్ విగ్రహాన్ని ఊరేగించారు. ఇందులో గ్రామీణ కళాకారులు ఆడుతూ, పాడుతూ నృత్యాలతో అలరించారు. ఈ ఊరేగింపులో తంజావూర్, సేలం, నామక్కల్, కోవై, తేని, ఈరోడ్, మదురై, తిరునల్వేలి తదితర జిల్లాల సహా పొరుగు రాష్ట్రాలకు చెందిన లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. మేల్ మరువత్తూరు ఆధ్యాత్మిక సంస్థ చైర్మన్ లక్ష్మి అధ్యక్షతన సాయంత్రం 6గంటలకు సంక్షేమ సహాయాల కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథులుగా భారత్‌లో మలేసియా దౌత్యవేత్త శరవణకుమార్, మాజీ న్యాయమూర్తులు రాజేశ్వరన్, కలైయరసన్, పిల్లల సంక్షేమ విభాగం ప్రధాన అధికారి రాజ్‌కుమార్, జిల్లా న్యాయమూర్తి కరుణానిధి తదితరులు పాల్గొని, ప్రత్యేక సంచిక ఆవిష్కరించారు. ఆదిపరాశక్తి పీఠం తరుపున ఇంటర్నెట్ ద్వారా కోటికి పైగా అర్చన కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు అధికారులు నిర్వాహకులకు అవార్డు బహుకరించారు. అనంతరం విద్యార్థులు, దివ్యాంగులు, వృద్ధులు సహా 15వేలమంది లబ్ధిదారులకు కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్, స్కూటర్, సైకిల్స్, ప్రభుత్వ పాఠశాలలకు ఫ్యాన్లు, ఫర్నిచర్, వైద్య పరికరాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఠం ఉపాధ్యక్షుడు కేపీ అన్బలగన్, కేపీ సెంథిల్‌కుమార్, శ్రీదేవి రమేష్, జయ గణేష్, ఆశా అన్బలగన్, శ్రీలేఖ, సెంధిల్‌కుమార్, అగస్త్యన్, డాక్టర్ మధుమలర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా కోవై కోనియమ్మన్ ఆలయ రథోత్సవం

చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యనగరం కోయంబత్తూరులో కోనియమ్మన్ ఆలయ వార్షిక రథోత్సవం బుధవారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. ఆ ఆలయ వార్షిక రథోత్సవ వేడుకలు ఫిబ్రవరి 15న ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో ప్రతిరోజూ అమ్మవారు పులి, చిలుక, సింహం, హంస, కామధేను, ఐరావత వాహనాల్లో మాడవీధుల్లో వీధులలో ఊరేగారు. మంగళవారం రాత్రి అమ్మవారి తిరుకల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆ సందర్భంగా కోయంబత్తూరు నగరంలోని ప్రముఖులు ఊరేగింపుగా సారె తీసుకెళ్ళి సమర్పించారు. ఈ వేడుకలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం బుధవారం మధ్యాహ్నం 2.05 గంటలకు ప్రారంభమైంది. రాజవీధి, ఒప్పనకార వీధి, వైశ్య వీధి, కేజీ వీధి మీదుగా సాగింది. మంత్రులు సెంథిల్‌బాలాజీ, పీకే శేఖర్‌బాబు, ఆధ్యాత్మిక ప్రముఖులు శాంతలింగ మరుదాచల అడిగళార్, కుమారుగురుపర స్వామి, కలెక్టర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోయంబత్తూరు ప్రధాన వీధిలో ఊరేగుతున్న కోనియమ్మన్ ఆలయ రథం





జెర్రిపోతు

పట్టుబడిన నాగుపాము

వామ్మో!

ఒకే రోజు ఆందోళన పెట్టిన నాగుపాము, జెర్రిపోతు

తిరుమల, మార్చి5(ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడక మార్గంలో బుధవారం ఆరు అడుగుల నాగుపాము పట్టుబడింది. గాలిగోపురం వద్ద జనసంచారంలోకి వచ్చిన నాగుపాము భక్తులను ఆందోళన పెట్టింది. సమాచారంతో భాస్కర్ నాయుడు ఘటనా ప్రాంతానికి చేరుకుని దానిని బంధించారు. అలాగే తిరుమల సేవా సదన్‌కు సమీపంలో ఉన్న గార్డెన్‌లోనూ ఏడు అడుగుల పొడవైన జెర్రిపోతును భాస్కర్‌నాయుడు పట్టుకున్నారు. ఈ పాములను అడవిలో విడిచిపెట్టారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. శ్రీపాదరాజ మఠాధిపతి సుజయ నిధితీర్థ స్వామిజీ, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఆర్కే రోజా ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





సుజయనిధితీర్థ స్వామిజీ - ఆర్కే రోజా - సబితా ఇంద్రారెడ్డి


సర్వదర్శనానికి 5 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.65 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,861

తలనీలాలు సమర్పించినవారు: 19,639



గురుకులం పిలుస్తోంది

మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పది పాఠశాలల్లో 600 సీట్లున్నాయి. బ్యాక్‌లాగ్ సీట్లను కూడా భర్తీ చేయనున్నారు. ఈనెల 15లోగా ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

ఉమ్మడి జిల్లాలో 10 పాఠశాలల్లో 600 సీట్లు

ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు ఈనెల 15

ఏప్రిల్ 25, 27, 28 తేదీల్లో ప్రవేశ పరీక్షలు



తిరుపతిలోని బీసీ గురుకుల పాఠశాల భవనం

పాఠశాలలు - సీట్లు

ప్రాంతం	కేటగిరీ	కేటాయించిన సీట్లు
తిరుపతి	బాలికలు	80
పీలేరు	బాలికలు	80
కలికిరి	బాలికలు	80
పెద్దపంజాణి	బాలికలు	40
పులిచెర్ల	బాలికలు	40
సదుం	బాలురు	80
సత్యవేడు	బాలురు	80
ఐతేపల్లి (తిరుపతి)	బాలురు	40
అంగళ్లు	బాలురు	40
కుప్పం	బాలురు	40

అర్హులు ఎవరంటే?

బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, అనాథ కేటగిరీలకు చెందిన విద్యార్థులు ప్రవేశాలకు అర్హులు. బీసీ, ఈబీసీ, ఇతర విద్యార్థులకు 11, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 12 ఏళ్ల వయో పరిమితిని నిర్దేశించారు. తల్లిదండ్రులు, సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించరాదు. పాత జిల్లాల ప్రకారం గురుకుల్లో అడ్మిషన్లు ఉంటాయి.

దరఖాస్తు విధానం

అర్హులు ఆన్‌లైన్‌లో రూ.100 పరీక్ష రుసుము చెల్లించి https://mjapapbcwreis.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కులు, కేటగిరీ ఆధారంగా సీట్లను భర్తీ చేస్తారు. ఇంటర్ ప్రవేశాలకు ఏప్రిల్ 25న, 5వ తరగతి ప్రవేశాలకు 27న, బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి 28న ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు.

సదుపాయాలు : ఉచిత వసతి, పౌష్టికాహారం, మూడు జతల యూనిఫాం, నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు లాంటివి ప్రభుత్వం సమకూర్చుతుంది. కాస్మొటిక్ చార్జీలను కూడా చెల్లిస్తుంది. ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తారు. యోగా, మ్యూజిక్, ఆర్ట్స్‌లోనూ శిక్షణ ఇస్తారు.

అంబేడ్కర్ గురుకులాలకు నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

ఉమ్మడి జిల్లాలోని 15 అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సర ప్రవేశానికి ఏప్రిల్ 6న పరీక్ష నిర్వహించనున్నారు. 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో చేరేందుకు గురువారం లోగా దరఖాస్తు చేసుకోవాలి. 5వ తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్ వరకు చదువుకోవచ్చు. వసతి, భోజనం, పుస్తకాలు సహా అన్నీ ఉచితమే.

అర్హతలు:

- 5వ తరగతిలో ప్రవేశం పొందగోరు ఎస్సీ, ఎస్టీ బాలికలు 2012 సెప్టెంబరు 1- 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ, బీసీ, బీసీ సీ విద్యార్థులు 2014 సెప్టెంబరు 1వతేదీ -2016 ఆగస్టు 31 మధ్య జన్మించినవారై ఉండాలి.
- ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న వారు జూనియర్ ఇంటర్‌లో చేరేందుకు అర్హులు.
- తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్షకు మించరాదు.

పాఠశాలలు - సీట్లు:

రామకుప్పం, బి. కొత్తకోట, పూతలపట్టు, కుప్పం (విజయపురం)లో బాలుర పాఠశాలలు కాగా శ్రీకాళహస్తి, చిత్తూరు, పీలేరు, బురకాయలకోట, పలమనేరు, సత్యవేడు, పుత్తూరు, మదనపల్లు, కుప్పం, వాల్మీకిపురం, జీడీనెల్లూరుల్లో బాలికల పాఠశాలలున్నాయి. తరగతికి 80 చొప్పున సీట్లు ఉంటాయి. జూనియర్ ఇంటర్‌లో 40, సీనియర్ ఇంటర్‌లో 40 సీట్లున్నాయి.

శాస్త్రోక్తంగా వేద పారాయణం




వేద పారాయణం చేస్తున్న పండితులు - ధూర్జటి కళాప్రాంగణంలో పారాయణం చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపును పురస్కరించుకొని బుధవారం ఉదయం వేద పారాయణ సభ శాస్త్రోక్తంగా జరిగింది. ఉత్సవాల్లో చివరి రోజు వేద సభ జరగడం ఆలయ సంప్రదాయం. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రముఖ దేవాలయాల నుంచి 100మంది ఘనాపాటిలైన వేద పండితులు ఆలయానికి విచ్చేశారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో ఋగ్వేదం, సామవేదం, శుక్ల యజుర్వేదం, కృష్ణ యజుర్వేదం బృందాలుగా పండితులు ఆశీనులయ్యారు. అనంతరం వేదాలను పఠించారు. వేద ఘోషలో ధ్వనించిన దివ్య శబ్ద తరంగాలతో వాయులింగేశ్వర క్షేత్రంలో భక్తులు పరవశించారు. అదే విధంగా ధూర్జటి కళా ప్రాంగణంలో కూడా వేదఘోష జరిగింది. అనంతరం ఈవో బాపిరెడ్డికి వేద పండితులు ఆశీర్వాదం అందజేశారు. వేద సభలో పాల్గొన్న పండితులకు ప్రత్యేక దర్శన ఏర్పాటు తర్వాత ఆలయ లాంఛనాలతో ఘనంగా సత్కరించారు. అలాగే స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు.



మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతం

●మంత్రుల సమీక్షలు సఫలీకృతం ● అధికారుల సమన్వయంపై భక్తుల సంతృప్తి

శ్రీకాళహస్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. గత నెల 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు 14రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు సాగుతున్న విషయం తెలిసిందే. ఈ ఉత్సవాల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయం విదితమే. ఇందులో భాగంగా సీఎం చంద్రబాబు ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాల పర్యవేక్షణ కోసం హోం మంత్రి అనిత, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కమిటీ ఏర్పాటు చేయించారు. మంత్రులు స్వయంగా శ్రీకాళహస్తికి చేరుకుని ఎమ్మెల్యే సుధీర్‌తో పాటు అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. అలాగే కలెక్టర్ పలుమార్లు శాఖల అధికారులతో సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు సూచనలు చేశారు. ఉత్సవాల దృష్ట్యా నెల రోజుల ముందే సన్నిధి వీధి, రాజగోపురం వద్ద రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే సుధీర్ చేయించారు. అలాగే తిరుపతి రోడ్డులో మరమ్మతులు చేయడం, గిరిప్రదక్షిణ సాగే పట్టణంలోని తెలుగుగంగ కాలనీరోడ్డును బాగుచేయడంతో ఉత్సవాల సందర్భంగా రాకపోకలకు ఇబ్బందులు తగ్గుముఖం పట్టాయి. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పలుమార్లు శ్రీకాళహస్తిలో పర్యటించారు. ఆయన స్వయంగా పట్టణ నలుమూలలో సంచరించి శివారు ప్రాంతాల్లో 11 పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య భక్తులకు దూరమైంది.



ఆలయంలో భక్తుల రద్దీ

ఇక ఎస్పీ, ఈవో బాపిరెడ్డి మహాశివరాత్రి రోజున స్వయంగా క్యూలైన్లను పర్యవేక్షిస్తూ సామాన్య భక్తులు త్వరితగతిన దర్శనం పొందేలా పగడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఉచిత లడ్డూ ప్రసాదం వితరణ, మహిళలకు వాయనం ఇవ్వడం భక్తులను సంతోష పరిచింది. ఈ యేడాది శివరాత్రి రోజున పెద్దఎత్తున ప్రముఖులు ముక్కంటి ఆలయానికి విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇక ధ్వజావరోహణం రోజున తప్ప మిగతావన్నీ సమయపాలనతో సాగడంపై భక్తులు హర్షించారు. మౌలిక వసతులు కూడా భక్తులకు సంవృద్ధిగా ఏర్పాటు చేశారు. మొత్తంగా మంత్రుల సమీక్షలు ఉత్సవాల విజయవంతం కావడానికి బాటలు వేశాయి.

రూ.35 లక్షల విలువైన బంగారు, 2116 గ్రాముల వెండి స్వాధీనం

ఏడుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 5(ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్లుగప్పి దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను తిరుపతి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి దాదాపు రూ.35 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను బుధవారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియాకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన ప్రకారం.. తిరుపతి నగరం శివజ్యోతినగర్‌కు చెందిన ముత్తాల అరుణ్, డేరంగుల జగదీష్, ముత్తాల తేజస్, బాలాయపల్లి మండలం వెంగమాంబపురానికి చెందిన అక్కుర్తి నవీన్, అక్కుర్తి పెంచలయ్య, తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంకు చెందిన పి.విఘ్నేష్, బీటీఆర్ కాలనీకి చెందిన లోకనాథరెడ్డి స్నేహితులు. తొలినుంచీ ఈజీ మనీకి అలవాటు పడ్డారు. మద్యానికి బానిసయ్యారు. చెడు అలవాట్లు అలవడటంతో డబ్బు కోసం ఇంటి దొంగతనాల వైపు అడుగేశారు. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు కీలకం. కొన్నేళ్లుగా తిరుపతితో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ దొంగతనాలకు పాల్పడేవారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని పగటి పూట రెక్కీ నిర్వహించేవారు. రాత్రిళ్ల దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో ఫిబ్రవరిలో తిరుపతి రూరల్ తిరుచానూరులోని శంకర్ నాయుడు కాలనీలో ఉంటున్న అంబుజ ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. దీనిని గమనించిన ఈ ఏడుగురు.. ఓ రాత్రి వేళ ఇంటి తాళాలు పగులకొట్టి బీరువా, అల్మారాల్లోని అలమరాల్లో వున్న బంగారు నగలు, డబ్బులు, వెండి వస్తువులు అపహరించుకుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుచానూరు సీఐ సునీల్ అప్పట్లో కేసు నమోదు చేశారు.

నిఘా ఉంచి.. పట్టుకుని

ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐ సాయినాథ్ చౌదరి, అరుణ, జగన్నాథ రెడ్డి, క్రైం పార్టీ సిబ్బంది ప్రభాకర్, ప్రసాద్, ఎల్‌బీ ప్రసాద్ బృందాలుగా నిందితుల కదలికలపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో సీఐ సునీల్‌కుమార్ బృందం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ముళ్ళపూడి క్రాస్ వద్ద అనుమానంగా తిరుగుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరు శంకర్‌నాయుడు కాలనీలో దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించారు. వీరి నుంచి దాదాపు రూ.35 లక్షల విలువైన 501 గ్రాముల బంగారు నగలు, 2116 గ్రాముల వెండి ఆభరణాలు, కారు, ఆటో, స్కూటరును స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలోని ముత్తాల అరుణ్‌పై 29 కేసులు, అక్కుర్తి నవీన్‌పై 11 కేసులు, పెంచలయ్యపై 18 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిపై సస్పెక్ట్ షీట్లు ఉన్నాయి. ఈ ముఠాను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చెప్పారు. ఈ కేసులో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.



దొంగల అరెస్టును చూపి.. మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

నేలపట్టులో ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు చర్యలు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 5(ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో ఎకో సెన్సిటివ్ జోన్ కోసం మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయాలని జేసీ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఈ అంశంపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ దొరవారిసత్రం మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం నుంచి 2కి.మీ. విస్తీర్ణాన్ని ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రభుత్వం గుర్తించిందన్నారు. అక్కరపాకు, షైలంగం, ముచ్చలగుంట, నెలబల్లి, నెల్లూరుపల్లి, వెంగమాంబపురం, ఏకొల్లు, నేలపట్టు తదితర రెవెన్యూ గ్రామాల్లో ఇది ఉంటుందని వెల్లడించారు. పర్యావరణంతో పాటు టూరిజం, వ్యవసాయ, ఉద్యానవనం, మత్స్యశాఖ చేపట్టాల్సిన అంశాలపై చర్చించి మ్యాప్ రూపొందించాలని సూచించారు. సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో తయారు చేస్తున్న ఈ మాస్టర్ ప్లాన్‌లో అధికారులందరూ భాగస్వాములు కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట డివిజన్ డీఎఫ్‌వో హారిక, అడిషనల్ డీఎఫ్‌వో నాగభూషణ్, అధికారులు జయచంద్ర, వినోద్, సౌజన్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర లోకాయుక్త ఛైర్మన్‌గా జస్టిస్ రాజమాణిక్యం

టినగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర లోకాయుక్త ఛైర్మన్‌గా మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పి.రాజమాణిక్యంను గవర్నర్ నియమించారు. అదే విధంగా లోకాయుక్త సభ్యులుగా జిల్లా వినియోగదారుల సమస్యల పరిష్కార సంఘం ఛైర్మన్ వి.రామరాజ్ (నామక్కల్), ఆదాయపన్నుల అప్పిలేట్ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు ఆరుముగ మోహన్ అళగుమణిని నియమించారు. ఈ ముగ్గురూ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జస్టిస్ పి.రాజమాణిక్యం 2027 ఏప్రిల్ 17 వరకు ఈ పదవిలో కొనసాగుతారు. సభ్యులిద్దరూ ఐదేళ్ల పాటు, లేదా 70 యేళ్ల వయస్సు వచ్చేంత వరకు పదవుల్లో కొనసాగుతారని రాజ్‌భవన్ అధికారులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. లోకాయుక్తా ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన జస్టిస్ పి.రాజమాణిక్యం 1959 మే 31న జన్మించారు. 1983లో న్యాయవాదిగా సేవలందించారు. ఆ తరువాత జిల్లా మేజిస్ట్రేట్, జిల్లా ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ ఇలా అంచెలంచెలుగా పదోన్నతులు పొందారు. 2016లో మద్రాసు హైకోర్టు రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. 2017లో హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొంది 2021 మే 30న పదవీ విరమణ పొందారు.

ప్యాసింజర్ రైళ్ల రద్దు 31 వరకు కొనసాగింపు

తిరుపతి(సెంట్రల్), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కుంభమేళా కోసం రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లలో కొన్నింటిని ఈనెల 8 నుంచి 31వ తేదీ వరకు, మరికొన్నింటిని 17వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు. తిరుపతి-కదిరి దేవరపల్లి (57405-57406), తిరుపతి-గుంతకల్లు(57403-57404), తిరుపతి-హుబ్లీ (57401-57402) మధ్య రాకపోకలు సాగించే రైళ్లను ఈనెల 31వరకు, తిరుపతి-కాట్పాడి మధ్య నడిచే ఆరు డెము ప్యాసింజర్లను ఈనెల 17వ తేదీ వరకు రద్దు చేస్తున్నామని వివరించారు.



నేడు అరక్కోణంకు అమిత్‌షా

ప్యారీస్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా అరక్కోణంలోని కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్ఎఫ్) 56వ వార్షికోత్సవాలకు ముఖ్యఅతిథిగా కేంద్రహోం శాఖామంత్రి అమిత్‌షా హాజరుకానున్నారు. ఆయన పర్యటన దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా భద్రత పటిష్ఠం చేశారు. అదే విధంగా డ్రోన్ల ఎగరవేతను పూర్తిగా నిషేధించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల సముద్రతీర ప్రాంతాల నుండి పొరుగు దేశాలకు మాదకద్రవ్యాలు, ఆయుధాల అక్రమ రవాణాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, సముద్రతీరాల్లో భద్రత పటిష్ఠం చేసేందుకు కేంద్రప్రభుత్వం మొట్టమొదటి సారిగా సైక్లథాన్ పథకాన్ని రూపొందించింది. అరక్కోణం సమీపంలోని తక్కోళంలోవున్న రాజాధిత్య చోళన్ ఆర్టీసీ సీఐఎస్ఎఫ్ ప్రాంగణంలో గురువారం సైక్లథాన్ పథకాన్ని కేంద్ర మంత్రి అమిత్‌షా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా త్రివిధ దళాల గౌరవ వందనాన్ని కేంద్రమంత్రి స్వీకరిస్తారు. అమిత్‌షాతో పాటు త్రివిధ దళాలకు చెందిన ఉన్నతాధికారులు, పలువురు ప్రముఖులు గురువారం రానున్న సందర్భంగా రాణిపేట జిల్లావ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి, వాహనాల తనిఖీలు నిర్వహించారు.

భక్తులపైకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

తమిళనాడుకు చెందిన మహిళ మృతి

తిరుపతి(నేరవిభాగం), మార్చి 5(ఆంధ్రజ్యోతి): బైకుపై వేగంగా వస్తూ అదుపు చేయలేకపోయాడు. కొండకు నడిచి వెళుతున్న భక్తులపైకి దూసుకెళ్లాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తమిళనాడుకు చెందిన వీరమ్మాల్(60) మృతిచెందారు. ఈ ఘటన బుధవారం తిరుపతి నగరం ఇస్కాన్ ఆలయం వద్ద చోటుచేసుకుంది. అలిపిరి ఎస్ఐ అజిత తెలిపిన ప్రకారం.. తిరుపతికి చెందిన చంద్రశేఖర్ బైకుపై అన్నారావు సర్కిల్ మీదుగా ఇస్కాన్ రోడ్డు వైపు వెళుతున్నాడు. అదే సమయంలో తమిళనాడు రాష్ట్రం కాంచీపురం తాలూకా నల్లూరు గ్రామానికి చెందిన వీరమ్మాల్(60) కుటుంబ సభ్యులతో కలిసి నడుచుకుంటూ తిరుమల కొండకు వెళుతున్నారు. ఇస్కాన్ ఆలయం సమీపంలో బైకుపై వేగంగా వెళుతున్న చంద్రశేఖర్ అదుపు తప్పి వీరమ్మాల్‌ను ఢీకొన్నాడు. కింద పడటంతో ఆమె తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం రుయాకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



మృతి చెందిన వీరమ్మాల్